రీసర్వే లో ఒక్కరోజు కూడా వృథా చేయొద్దు

ప్రజాశక్తి-విజయనగరం

రీ సర్వే ప్రక్రియలో ఒక్కరోజు కూడా వృథా కాకూడదని ఇన్‌ఛార్జ్ కలెక్టర్ మయూర్ అశోక్ ఆదేశించారు. ఎక్కువ సమయం లేదని, పెండింగ్ ఉన్నచోట రాత్రికూడా పనిచేసి, క్లియర్ చేయాలని సూచించారు. రీసర్వే ప్రక్రియలో భాగంగా మ్యూటేషన్ల కరెక్షన్, ట్రాన్జాక్షన్, స్టోన్ ప్లాంటేషన్ తదితర అంశాలపై మండలాల వారీగా తాహశీల్దార్లు, ఆర్‌డిఒలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బుధవారం సమీక్షించారు. విఎస్, విఆర్‌ఒ, తాహశీల్దార్, ఆర్‌డిఒల లాగిన్‌లో మ్యుటేషన్లు ఒక్కరోజు కూడా పెండింగ్ ఉండటానికి వీల్లేదని స్పష్టం చేశారు. వచ్చిన వాటిని 24 గంటల్లోగా చూసి పంపించాలని, నిర్లక్ష్యం చూపిస్తే చర్యలు తీసుకుంటామని అన్నారు. తహశీల్దార్లు, ఆర్‌డిఒలు గ్రామాల వారీగా ప్రతిరోజూ తనిఖీ చేయాలని సూచించారు. 10వ తేదీ నాటికి ఎక్కడా పెండింగ్ ఉండకూడదని స్పష్టం చేశారు. కెఆర్‌ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ, సర్వేశాఖ ఎడి త్రివిక్రమరావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఎస్ఎఫ్ఐ సైకిల్‌యాత్ర

బహిరంగ సభలో అభివాదం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు మయూక్ బిశ్వాస్ అశోక్ రామ్మోహన్ తదితరులు

- వేలాది మందితో నగరంలో భారీ ప్రదర్శన
- 20 రోజుల్లోగా సమస్యలు పరిష్కరించకుంటే ఉధృత ఉద్యమం
- బహిరంగ సభలో ఎస్ఎఫ్ఐ నాయకులు

జిల్లాలో విద్యారంగ అభివృద్ధి కోసం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన చేపట్టిన విద్యార్థి సంగ్రామ సైకిల్‌యాత్ర బుధవారం ముగిసింది. గతనెల 31న కొత్తవలసలో ప్రారంభమైన ఈ యాత్ర పదిరోజులుపాటు పది మండలాల్లో సంక్షేమ వసతి గృహాలు, ప్రభుత్వపాఠశాలలు, కళాశాలలను పరిశీలిస్తూ, విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటూ సాగింది. యాత్ర ముగింపు సందర్భంగా నగరంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి బాలాజీ జంక్షన్ వరకు వేలాది మంది విద్యార్థులు భారీ ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులు ఎస్ఎఫ్ఐ జెండాలు చేతపట్టి విద్యా వ్యతిరేక విధానాలపై నినదించారు.

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎస్ఎఫ్ఐ అఖిల భారత ప్రధాన కార్యదర్శి మయూక్ బిశ్వాస్, రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్ వెంకటేష్, పి.రామ్మోహన్‌తో మరో 70 మంది విద్యార్థులు సైకిల్‌యాత్రతో ప్రదర్శన అగ్రభాగాన సాగారు. అనంతరం జిల్లా అధ్యక్షులు వెంకటేష్ అధ్యక్షతన జరిగిన సభలో మయుక్ బిశ్వాస్ మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం, మోడీకి పార్టనర్‌గా ఉన్న రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం ఎన్ఇపి అమలు చేసి మనకు భవిష్యత్ లేకుండా చేస్తున్నాయన్నారు. సైకిల్ యాత్రలో హాస్టళ్లలో మరుగుదొడ్ల సౌకర్యం లేదని మన దృష్టికి వచ్చిందని, విద్యార్థులకు మరుగుదొడ్ల సౌకర్యం కల్పించని మోడీ ప్రభుత్వం డిజిటల్ ఇండియా సాధిస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. విద్య ప్రైవేటీకరణకు, వ్యాపారీకరణకు వ్యతిరేకంగా, రానున్న కాలంలో ప్రభుత్వ విద్యా రంగాన్ని కాపాడుకునేందుకు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్ మాట్లాడుతూ విద్యారంగం అభివృద్ధి కావడం ద్వారానే జిల్లా,రాష్ట్రం సమగ్రాభివద్ధి జరుగుతుందన్నారు. అధికారంలోకి వస్తే ఎల్‌కెజి నుంచి పిజి వరకు ఉచిత విద్య అందిస్తామని చెప్పిన రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జీవో 77 ను తీసుకొచ్చి పేద విద్యార్థులకు పిజి విద్య అందకుండా చేశారన్నారు.

రాష్ట్రంలో ఎన్ఇపి అమలు చేయడం ద్వారా ఇప్పటికే సింగిల్ టీచర్ స్కూళ్లు 14వేలు మూతపడ్డాయని అన్నారు. త్వరలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్న మరో 25 వేళ స్కూళ్లు మూతపడేందుకు సిద్దంగా ఉన్నాయన్నారు. సెంట్రల్ జైల్లో ఉన్న ఖైదీలకు మెస్ ఛార్జీలు రోజుకు రూ. 90 ఇస్తుంటే విద్యార్థులకు కేవలం రూ.35 ఇస్తున్నారని, దీంతో మూడుపూటలా భోజనం ఎలా చేయాలని ప్రశ్నించారు. మెడికల్ కాలేజీ సీట్లు అమ్మకాన్ని ఆపి, పేదలకు సీట్లు వచ్చే విధంగా చూడాలన్నారు. స్కాలర్ షిప్స్,విద్యా దీవెన ,అమ్మ ఒడిలో కోతలు మానుకొని అందరికీ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర బాలికల విభాగం కన్వీనర్ పావని మాట్లాడుతూ సైకిల్ యాత్ర లో విద్యార్థినుల బాధలు కళ్ళారా చూశామన్నారు. సరైన వైద్య సౌకర్యం, మరుగుదొడ్ల సౌకర్యం చాలా వసతి గృహాల్లో లేవన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి రామ్మోహన్ మాట్లాడుతూ పదిరోజులుపాటు 400 కిలోమీటర్లు ప్రయాణించి హాస్టల్స్, స్కూళు ,,జూనియర్,డిగ్రీ కాలేజీల్లో విద్యార్థుల సమస్యలను తెలుసుకున్నామన్నారు. ఏహాస్టల్‌లోనూ మరుగుదొడ్లు సరిగా లేవన్నారు. పోరాడి సాధించిన విజయనగరం, గజపతినగరం డిగ్రీ కాలేజీల్లో అధ్యాపకులు లేరన్నారు. కొత్తవలస లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ప్రైవేటు విద్యా సంస్థలలో ఫీజుల దోపిడీని అరికట్టేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సైకిల్ యాత్ర ద్వారా గుర్తించిన సమస్యలు 20 రోజుల్లోగా పరిష్కరించకపోతే కలెక్టరేట్‌ను, విద్యా శాఖ మంత్రి ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు.

అనంతరం ఎస్ ఎఫ్ ఐ జిల్లా బాలికల విభాగం కన్వీనర్ సౌమ్య మాట్లాడుతూ జగన్ మామయ్య, మోడీ తాతయ్యలు ప్రభుత్వ విద్యా రంగాన్ని నాశనం చేస్తుంటే విద్యార్థులు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే, ప్రభుత్వ విద్యను పేదలకు దూరం చేస్తే మిమ్మల్ని ప్రజలనుంచి దూరం చేసేలా ఉద్యమిస్తామని అన్నారు. విశాఖపట్నం జిల్లా కార్యదర్శి ఎల్‌జె నాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో రక రకాల యాత్రలు వారి రాజకీయ అవసరాలు కోసం,పదవులు కోసం జరుగుతున్నాయని, ఎస్ఎఫ్ఐ చేపట్టిన సైకిల్ యాత్ర మన భవిష్యత్ కోసం,ప్రభుత్వ విద్యను కాపాడుకునేందుకు జరిగిందని అన్నారు. సమస్యలు పరిష్కారం కాకుంటే ప్రభుత్వాలపై విద్యార్థులు తిరుగుబాటుకు సిద్ధం కావాలనికోరారు. సభలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు డి.రాము, హర్ష సైకిల్ యాత్ర చేపట్టిన నాయకులు పాల్గొన్నారు. సైకిల్ యాత్ర చేపట్టిన విద్యార్థి బృందాన్ని మయూక్ బిశ్వాస్ అభినందించారు.

బహిరంగ సభకు హాజరైన విద్యార్థులు

పిల్లలతో కలిసి ఆత్మహత్య చేసుకున్న సంధ్య (ఫైల్)

బతుకు తెరువు కోసం వెళ్లి...

విశాఖలో ఇద్దరు పిల్లలతో తల్లి ఆత్మహత్య

పాతబొబ్బిలిలో విషాదఛాయలు

ప్రజాశక్తి-బొబ్బిలి

బతుకు తెరువు కోసం పదేళ్ల క్రితం కుటుంబమంతా విశాఖ వెళ్లారు. విశాఖ మర్రిపాలెంలో హుడా లేఅవుట్లో పని చేసుకుని జీవనం సాగిస్తున్నారు. కుటుంబ కలహాలు రావడంతో ఇద్దరు పిల్లలతో సహా తల్లి ఆత్మహత్య చేసుకోవడంతో పాత బొబ్బిలిలో తీవ్ర విషాదం అలముకుంది.

పాత బొబ్బిలికి చెందిన గులిపల్లి లక్ష్మణ్, భార్య సంధ్య(32), కుమారుడు గౌతమ్(7), కుమార్తె ఆలేఖ్య(5) కలిసి విశాఖ మర్రిపాలెంలోని హుడా లేఅవుట్లో జీవనం సాగిస్తున్నారు. లక్ష్మణ లేఅవుట్లో ఉన్న ప్రకాష్ రెసిడెన్సీలో వాచ్‌మెన్‌గా పని చేయడంతో పాటు తాపీ పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. భార్యాభర్తల మధ్య గొడవలు జరిగినట్లు తెలిసింది. ఈనేపథ్యంలో మంగళవారం రాత్రి భర్త నిద్రలోకి వెళ్లిన తర్వాత పిల్లలను తీసుకుని సంధ్య తన ఇద్దరు పిల్లలను తీసుకొని వెళ్లి అపార్టుమెంట్‌పైన నీరు నిల్వ చేసుకునే సంపులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. లక్ష్మణ్ కు మధ్యలో మెలుకువ రావడంతో పక్కన భార్య, పిల్లలు లేకపోవడంతో అపార్ట్మెంట్ లో ఉన్నవారిని నిద్ర లేపి వేతికాడు. సంపు పైకప్పు తీసి ఉండడంతో అనుమానం వచ్చి చూడగా సంధ్య, పిల్లలు విగత జీవులుగా కనిపించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్ కు మతదేహాలను తరలించారు. కుటుంబ కలహాలు వలనే ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తుంది.

పాత బొబ్బిలిలో విషాదం

జీవనోపాధి కోసం వెళ్లిన గులిపల్లి లక్ష్మణ భార్య సంధ్య, ఇద్దరు పిల్లలు ఆత్మహత్య చేసుకోవడంతో పాతబొబ్బిలిలో విషాదఛాయలు అలుముకున్నాయి. స్వగ్రామం వచ్చినప్పుడల్లా లక్ష్మణ, ఆయన భార్య సంధ్య, పిల్లలు అందరితో కలిసి,మెలిసి ఉండేవారని గ్రామస్తులు చెపుతున్నారు. సంధ్య, ఇద్దరు పిల్లలు మరణవార్త వినడంతో కుటుంబ సభ్యులు, బంధువులు బోరున విలపిస్తున్నారు. కడసారి చూసేందుకు కుటుంబ సభ్యులు, బంధువులు విశాఖ తరలి వెళ్లారు.

నిరసన దీక్ష చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

క్విట్ మోడీ...సేవ్ ఇండియా

కలెక్టరేట్ వద్ద ప్రజాసంఘాల నిరసన దీక్ష

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

క్విట్ ఇండియా డే స్ఫూర్తితో క్విట్ మోడీ.. సేవ్ ఇండియా నినాదంతో కలెక్టరేట్ వద్ద ఎఐకెఎస్, సిఐటియు, ఇఫ్టూ, పిఒడబ్ల్యు, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతు సంఘం, ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆప్రా, ఇతర సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద బుధవారం నిరసన దీక్ష చేపట్టారు. ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బుద్ధ రాజు రాంబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ మాట్లాడారు.

స్వేచ్ఛ, స్వాతంత్రం, సమానత్వం కోసం జాతీయ ఉద్యమం జరిగిందని, భారతదేశం నుంచి బ్రిటిష్ వారిని తరిమి కొట్టాలని నినదిస్తూ ఆగస్టు 9న క్విట్ ఇండియా పిలుపునిచ్చారని తెలిపారు. మోడీ ప్రభుత్వం అంబానీ, అదానీలకు దేశ సంపదను , ప్రభుత్వ రంగ సంస్థల్ని కట్టబెడుతోందన్నారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేటీ కరణ చేసి రైతాంగాన్ని దెబ్బతీస్తుందని, కార్మిక చట్టాలను చాప చుట్టి కార్మికులకు సంకెళ్లు బిగిస్తుందని, మతతత్వ,కులతత్వ, విచ్ఛిన్నకర భావజాలాన్ని చెప్పించి ప్రజల ఐక్యతను నిట్ట నిలువునా చీలుస్తుందని అందుకనే క్విట్..మోడీ సేవ్‌ఇండియా నినాదంతో ఈ కార్యక్రమం దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. మోడీ, బిజెపి పోతే తప్ప భారతదేశాన్ని, రాజ్యాంగాన్ని ,ప్రభుత్వ రంగాన్ని కాపాడుకోలేమని తెలిపారు.

నిరసన దీక్షకు సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో కార్మిక ,రైతుసంఘాల నాయకులు కె.సురేష్, జి.శ్రీనివాస్, జి.గీత, పి.అప్పారావు, నాగభూషణరావు, వి.లక్ష్మి, టివి రమణ, ఎ.జగన్మోహన్, యుఎస్ రవికుమార్, బి.రమణ, రాకోటి రాములు, ఆదినారాయణ , చల్లా జగన్ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభలో మాట్లాడుతున్న చంద్రబాబు

సాగునీటి ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తా

- తోటపల్లికి జంఝావతిని అనుసంధానిస్తా
- బహిరంగ సభలో చంద్రబాబునాయుడు
- పార్వతీపురానికి హామీల వర్షం

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి, గరుగుబిల్లి, పార్వతీపురం రూరల్

టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే తోటపల్లి, జంఝావతి సహా చిన్న చిన్న గెడ్డలైన అడారిగెడ్డ, గుమ్మడిగెడ్డ వంటి మినీ ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తానని టిడిపి అధినేత చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. జంఝావతి నదిని తోటపల్లి ప్రాజెక్టుతోను, వంశధార, నాగావళి నదులకు చిన్న చిన్న నదులను అనుసంధానం చేస్తామని అన్నారు. రాష్ట్రంలో సాగునీటి ప్రోజెక్టుల విధ్వంసంపై యుద్ధభేరి కార్యక్రమంలో భాగంగా బుధవారం గురుగుబిల్లి మండలంలోని తోటపల్లి ప్రోజెక్టును మాజీ నీటిపారుదల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావుతో కలిసి పరిశీలించారు. కుడి,ఎడమ కాలువల పరిస్థితిని పరిశీలించిన అనంతరం ఉల్లిభద్ర ఎర్రన్న గుడి ప్రాంతంలో రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ముందుగా ఆదివాసీ దినోత్సవం సందర్భంగా అడవితల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం రైతులను ఉద్దేశించి చంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం వైఖరి వలన రాష్ట్రంలో అన్ని రంగాలు భ్రష్టుపట్టాయన్నారు. ఉత్తరాంధ్రలో 5 ప్రధాన నదులు, 69 పైగా ఉపనదులు ఉన్నాయని, వాటన్నింటినీ ప్రత్యేక ప్రణాళికతో అనుసంధానం చేసి ఉత్తరాంధ్ర కరువునివారణకు కృషి చేస్తామని తెలిపారు. ఇక్కడ మాజీ గిరిజన ఉపముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి.. టిడిపికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే కారణంతో తమ జాతికి చెందిన గిరిజనులను అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నారని, అధికారంలోకి వచ్చిన వెంటనే వారిపై చర్యలుంటాయని అన్నారు. రైతులకు ఏడాదికి రూ.20వేలు ఆర్థిక సాయం చేస్తామన్నారు. అమ్మకు వందనం పథకాన్ని ఆడపిల్లలందరికీ వర్తింపజేస్తామని, ఆర్‌టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తామని తెలిపారు. అన్న క్యాంటీన్లను పునుద్ధరించి, ఎన్ని కావాలంటే అన్ని ఏర్పాటు చేస్తామన్నారు. రేపు జరగబోయేది కురుక్షేత్ర పోరాటమని, కౌరవ సభను గౌరవ సభ చేస్తానని అన్నారు. రాష్ట్రంలో వెనుక బాటు నశించిపోవాలంటే జగన్ వంటివారిని మరి జీవితంలో అధికారంలోకి రాకుండా బుద్ధిచెప్పాలని, రానున్న ఎన్నికలలో వారిని చిత్తుచిత్తుగా ఓడించాలని కోరారు.

పార్వతీపురంపై హామీల వర్షం

పార్వతీపురంలో రోడ్డు షో సందర్భంగా చంద్రబాబుకు ప్రజలు స్వాగతంపలికారు. అనంతరం పాతబస్టాండ్ వద్ద జరిగిన సభలో మాట్లాడుతూ అధికారంలోకి వస్తే ఈ ప్రాంత సమస్యలన్నీ పరిష్కరిస్తానని హామీల వర్షం కురిపించారు. తోటపల్లి ప్రాజెక్టును పూర్తిచేసి పార్వతీపురానికి సాగు, తాగునీరు అందిస్తానని హామీఇచ్చారు. పార్వతీపురానికి బైపాస్‌రోడ్డు తీసుకొస్తానని, ఏరియా ఆస్పత్రిని 200 పడకలుగా అభివృద్ధి చేస్తానని, డంపింగ్‌యార్డును పూర్తి చేస్తామని తెలిపారు. గిరిజనప్రాంత ప్రధాన సమస్యగా ఉన్న పుర్ణపాడు-లాబేసు వంతెన పూర్తి చేస్తామని, ఏనుగుల సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. రహదారులకు మోక్షం కల్పిస్తామన్నారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బోనెల విజయ్‌కమార్‌కు పూర్తిగా సహకరించాలని కోరారు.

స్థానిక ఎమ్మెలే భూ కబ్జాలకు అడ్డుకట్ట వేయండి

స్థానిక ఎమ్మెల్యే తెల్లవారితే చాలు భూకబ్జాలు, సెటిల్‌మెంట్‌లు, బెదిరింపులకు పాల్పడుతున్నాడని, ప్రజలంతా అడ్డుకట్ట వేసి రానున్న ఎన్నికల్లో తగిన బుద్ది చెప్పాలని చంద్రబాబు అన్నారు. చెరువులను, ప్రభుత్వ భూములను ఆక్రమించేయడంతో పాటు అందరినీ బెదిరించి స్థలాలు లాక్కుంటున్నాడని అన్నారు. చెరువులు, ప్రభుత్వ భూములు ఆయన అబ్బసొమ్మా అని ప్రశ్నించారు. టిడ్కో ఇళ్లు పూర్తి చేసి ఐదేళ్లయినా లబ్ధిదారులకు అందజేయలేదన్నారు. పేదల ఇళ్ల పట్టాలపై సంతకాలు చేసి ఆయనే తహశీల్దార్‌గా, సబ్ రిజిస్ట్రార్‌గా వ్యవహరిస్తున్నాడని దుయ్యబట్టారు. కార్యక్రమంలో పొలిట్‌బ్యూరో సభ్యులు పి.అశోక్‌గజపతిరాజు, గుమ్మడి సంధ్యారాణి, కిమిడి కళావెంకటరావు, దేవినేని ఉమామహేశ్వరరావు, శత్రుచర్ల విజయరామరాజు, వైరిచర్ల కిషోర్‌చంద్రదేవ్, మాజీ ఎమ్మెల్యేలు భంజ్‌దేవ్, తోయక జగదీశ్వరి, వీరేష్‌దేవ్, ద్వారపురెడ్డి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణతో పిల్లలకు ఆరోగ్యం

డిఎంహెచ్ఒ భాస్కరరావు

ప్రజాశక్తి-విజయనగరం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డిఎంహెచ్ఒ తదితరులు

నులి పురుగుల నివారణ ద్వారా పిల్లల ఆరోగ్యానికి పూర్తి రక్షణ లభిస్తుందని రక్తహీనత సమస్యలు తొలగిపోతాయని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్. భాస్కరరావు పేర్కొన్నారు. 1-19 సంవత్సరాల లోపు వయసు గల పిల్లలకు ఈ మాత్రలు వేయటం ద్వారా బంగారు భవిష్యత్తును అందించవచ్చని అన్నారు. ఆగస్టు 10న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలో నిర్వహించబోయే కార్యక్రమాల నిమిత్తం బుధవారం తన కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆల్బెండజోల్ మాత్రలు వేయటం ద్వారా పిల్లల్లో హిమోగ్లోబిన్ శాతం పెరుగుతుందని, ఇతర అనేక ప్రయోజనాలు కలుగుతాయని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 4,834 కేంద్రాల్లో జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, దానిలో భాగంగా మహారాజ సంస్కృత కళాశాలలో గురువారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్, డిప్యూటీ స్పీకర్, జిల్లా పరిషత్ ఛైర్మన్ చేతుల మీదుగా కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నామని వెల్లడించారు. జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల్లో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామని పేర్కొన్నారు. ఒకే రోజు 3,60,974 మంది 1-19 సంవత్సరాల వయసు గల పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు అందజేసేందుకు ఏర్పాట్లు సిద్ధం చేశామని వివరించారు.

మిగిలిపోయిన వారికి 17వ తేదీన

గురువారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించే కార్యక్రమంలో ఒక వేళ ఎవరైనా మందులు తీసుకోలేకపోతే ప్రత్యేకంగా 17వ తేదీన ఆల్బెండజోల్ మాత్రలు అందజేస్తామని డిఎంహెచ్ఒ తెలిపారు. సమావేశంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ రవి కుమార్ పాల్గొన్నారు.

11న సత్య కళాశాలలో జాబ్‌మేళా

ప్రజాశక్తి-విజయనగరం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధికల్పనలో భాగంగా ఈనెల 11న సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి నీలం గోవింద తెలిపారు. ఇంటర్, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత సాధించి వయస్సు 18 నుండి 40 సవత్సరాల మధ్య ఉన్నటువంటి నిరుద్యోగ యువతి యువకులకు ఆరోజు ఉదయం 9గంటలకు సత్య కళాశాలకు హాజరు కావాలని తెలిపారు. జాబు మేళాకు ఎంఎస్ఎన్ లాబొరేటరీస్ ప్రైవేటు లిమిటెడ్, ఫ్లిప్ కార్ట్, ఐఐఎఫ్ఎల్ సంస్థ ఫైనాన్సు లిమిటెడ్ తదితర 3 బహుళ జాతి కంపెనీలు హాజరై అర్హత కలిగిన అభ్యర్థులను ఎంపిక చేస్తాయని తెలిపారు. యువతీ యువకులు bit.ly/43biYYa వెబ్ సైట్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకొని, రిఫరెన్స్ నెంబర్ తో పాటుగా బయోడేటా, ఆధార్‌కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లు తోహాజరు కావాలని తెలిపారు. వివరాలకు 8099461303, 9000102013 లేదా టోల్ ఫ్రీ నెంబరు 9988853335 ను సంప్రదించాలని కోరారు

ఘనంగా సిటియు వ్యవస్థాపక దినోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయంలో బుధవారం అంతర్జాతీయ గిరిజన ఉత్సవంతో పాటు యూనివర్శిటీ వ్యవస్థాపక దినోత్సవం నిర్వహించారు. గిరిజన విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ టివి కట్టిమణి సభా అధ్యక్షులుగా వ్యవహరించారు. ముఖ్య అతిథిగా బరంపూర్ డైరెక్టర్ ఆఫ్ ఐఐఎస్ఇఆర్ ప్రొఫెసర్ అశోక్ కుమార్ గంగూలీ ,హాజరై ప్రారంభోపన్యాసం చేశారు. గిరిజన యూనివర్సిటీని ప్రపంచ స్థాయి సంస్థగా అభివృద్ధి చేయాలని అన్నారు. గౌరవ అతిథిగా హాజరైన మైసూర్ ఎన్‌సిఇఆర్‌టి ప్రొఫెసర్ మురళిగాంధీ మాట్లాడుతూ విద్యాసంస్థల ఉత్సుకత, ఆవిష్కరణ, జీవనాధారంగా చేయడానికి జాతీయ విద్యా విధానం సిఫార్సులను తప్పనిసరిగా అమలు చేయాలని పేర్కొన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలునిర్వహించారు. కార్యక్రమంలో చైర్మన్ ప్రొఫెసర్ జితేంద్ర మిశ్రా, ఆర్గనైజింగ్ సెక్రటరీ గంగునాయుడు తదితరులు పాల్గొన్నారు.

1407 జంటలకు వైఎస్ఆర్ కళ్యాణ మస్తు

ప్రజాశక్తి-విజయనగరం



చెక్కును అందజేస్తున్న ఇన్‌ఛార్జి కలెక్టర్, బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి

జిల్లాలో 1407 జంటలకు వైయస్ఆర్ కళ్యాణ మస్తు ఆర్థిక సహాయం మంజూరు చేసినట్లు ఇంచార్జ్ కలెక్టర్ మయూర్ అశోక్ తెలిపారు. వైయస్ఆర్ కళ్యాణ మస్తు, వై.యస్.ఆర్ షాది తోఫా పథకం కింద 2023 ఏప్రిల్ - జూన్ త్రైమాసికంలో వివాహం చేసుకున్న 18,883 జంటలకు రూ.141.60 కోట్లు ఆర్థిక సహాయం అందించే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి తాడేపల్లి నుండి వర్చువల్ గా బుధవారం ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి ఇన్‌ఛార్జికలెక్టర్ మయూర్ అశోక్, బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి చిన్న అప్పల నాయుడు, డిఆర్‌డిఎ పీడీ కల్యాణ చక్రవర్తి , జిఎస్‌డబ్ల్యూ జిల్లా కోఆర్డినేటర్ నిర్మల దేవి, రెడ్డిక వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ రౌతు భాస్కర రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మయూర్ అశోక్ మాట్లాడుతూ జిల్లాలో 1407 జంటలకు రూ.8.32కోట్లు మంజూరు అయ్యాయన్నారు.

ఓటర్ల తనిఖీకి వేళలు నిర్దేశిస్తాం : ఇన్‌ఛార్జి కలెక్టర్

ప్రజాశక్తి- విజయనగరం

జిల్లాలో ప్రస్తుతం జరుగుతున్న ఓటర్ల తనిఖీ కార్యక్రమంలో బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి ఏజెంట్లు కలసి వెళ్లేందుకు వీలుగా ఏ సమయాల్లో ఇళ్ల సందర్శన చేపట్టాలో వేళలు నిర్దేశించి తెలియజేస్తామని జిల్లా ఇన్ ఛార్జి కలెక్టర్ మయూర్ అశోక్ చెప్పారు. ఓటర్లు ఏ వేళల్లో ఇళ్ల వద్ద అందుబాటులో వుంటారో గుర్తించి ఆ సమయాల్లోనే బూత్ స్థాయి అధికారులు వెళ్లేలా వేళలు నిర్దేశిస్తామని, ఆ విషయాన్నిఏజెంట్లకు కూడా తెలిపి వారు కూడా తనిఖీల్లో పాల్గొనేలా చూస్తామన్నారు. రాజకీయ పార్టీలతో కలసి పనిచేసి జిల్లాలో ఆరోగ్యవంతమైన ఓటర్ల జాబితా రూపొందించేందుకు కృషి చేస్తామన్నారు. జిల్లాలోని రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ కార్యక్రమంపై బుధవారం కలెక్టర్ కార్యాలయంలో చర్చించారు. ఇళ్ల తనిఖీకి వెళ్లినపుడు చాలా కుటుంబాలు ఇళ్ల వద్ద అందుబాటులో వుండటం లేదని ఆర్‌డిఒ ఎంవి.సూర్యకళ తెలిపారు. ఎన్నికల కమిషన్ ఓటర్ల తనిఖీల కోసం రూపొందించిన యాప్ రెండురోజుల్లో పూర్తిస్థాయిలో పనిచేస్తుందని, సమస్యలు పరిష్కారం అవుతాయని డిఆర్‌ఒ తెలిపారు.

అభివృద్ధికి దూరంగా ఆదివాసీల జీవనం

కేక్ కట్ చేస్తున్న పాలవలస గౌరు

బాడంగి: ఆదివాసీలు అభివృద్ధికి దూరంగా జీవనం సాగిస్తున్నారని ప్రభుత్వాలు మారుతున్నా వారి తలరాతలు మాత్రం మారడం లేదని జిల్లా ఏకలవ్య అధ్యక్షులు పాలవలస గౌరు అన్నారు. బుధవారం ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఎరుకల పాకల గ్రామంలో కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజ్యాంగంలో నిర్దేశించిన నిబంధనల ప్రకారం అటవీ ప్రాంతంలో స్థిర నివాసం కలిగిన 33 తెగల సమూహాలను ఆదివాసీలుగా గుర్తించారన్నారు. ఏటిలో మాత్రం వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజనులకు ప్రత్యేక కేటాయింపులు లేవన్నారు. ఐటిడిఏలు అచేతనంగా పడి ఉన్నాయన్నారు. రాజ్యాంగబద్ధ నిధులు దారి మళ్లుతున్నాయన్నారు. ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను సంక్షేమ పథకాల కోసం మళ్లిస్తున్నారన్నారు. నవరత్నాల్లోనే గిరిజన సంక్షేమాన్ని చూపిస్తున్నారని చెప్పారు. ఫలితంగా గిరిజనులు కష్టాల పాలవుతున్నారన్నారు. ఎరుకల కులస్తులు కూడా ఐక్యంగా ఉండి మన హక్కులను సాధించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పార్వతి ఉన్నారు.

ఆక్రమణలపై మున్సిపల్ అధికారుల కొరడా

బొబ్బిలి: మున్సిపాలిటీలో ఆక్రమణలపై మున్సిపల్ అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. టిటిడి కల్యాణ మండపం ప్రహరీ పక్కన ఉన్న షాపులను, యాతవీధిలో రోడ్డు పక్కన ఆక్రమణలను తొలగించిన మున్సిపల్ అధికారులు బుధవారం మార్కెట్ రోడ్డులో ఆక్రమణలను తొలగించారు. మార్కెట్ రోడ్డులో రోడ్డుకు ఇరువైపుల కాలువలు, రోడ్డును ఆక్రమించుకొని షాపులు పెట్టి వ్యాపారం చేయడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. ఎప్పటికప్పుడు ట్రాఫిక్ సమస్య తలెత్తడంతో మున్సిపల్ అధికారులు స్పందించి జెసిబితో ఆక్రమణలను తొలగించారు. ఆక్రమణలు తొలగించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ధర్నాను జయప్రదం చేయండి

డెంకాడ: ఈ నెల 12న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఫ్యాప్టో ఆధ్వర్యంలో నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని యుటిఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్. చంద్రరావు, కె. శోభన్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఆ రోజు ఉదయం 9.30గంటల నుంచి సాయంత్రం వరకూ ధర్నా చేపడతామన్నారు.

విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి

రామభద్రపురం: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో పౌష్టికాహారాన్ని సక్రమంగా అమలు చేయాలని రాష్ట్ర ఆహార భద్రత కమిషన్ సభ్యురాలు లక్ష్మారెడ్డి ఆదేశించారు. బుధవారం ఆయన మండల పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలు, ప్రజా పంపిణీ కేంద్రాలు, రేషన్ పంపిణీ వాహనాలను తనిఖీ చేశారు. రామభద్రపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిల్లలకు అందివలసిన ఆహార పంపిణీలో పలు లోపాలను గుర్తించి ప్రధానోపాధ్యాయుడు కామేశ్వరరావుకు షోకాజ్ నోటీసు జారీ చేయమని బొబ్బిలి ఉప విద్యాశాఖాధికారికి ఆదేశాలు జారీ చేశారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యాశాఖ కమిషనర్ ప్రవీణ్ ప్రకాష్ పర్యటనలో కూడా ఇదే ప్రధానోపాధ్యాయుని లోపాలు బయట పడినప్పటికీ పనితీరు మారలేదు. ఈ కార్యక్రమంలో స్థానిక మండల సిఎసిటి సాయి క్రిష్ణ, ఐసిడిఎస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక అంశాలను పెంపొందించుకోవాలి

విజయనగరం టౌన్: విధి నిర్వహణలో సాంకేతిక పర అంశాలలో మెళకువలను వృద్ధి చేసుకొని పౌర సేవలు మరింత సమర్థవంతంగా అందించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఆర్ శ్రీరామలునాయుడు సచివాలయ కార్యదర్శులకు దిశా నిర్దేశం చేశారు. పుర పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ సంబంధించి అడ్మిన్, ఎడ్యుకేషన్, ప్లానింగ్, ఎమినిటిస్, శానిటేషన్, వెల్ఫేర్ కార్యదర్శిలకు 4 రోజులపాటు శిక్షణ తరగతులు జరిగాయి. స్థానిక మహిళా ప్రాంగణం ఆవరణలో విశ్రాంతి డిప్యూటీ కలెక్టర్ బి.శ్రీనివాస్, విశ్రాంత ట్రెజరీ అధికారి వై. సంఘమేశ్వరరావు కార్యదర్శులకు అవగాహన కల్పించారు. బుధవారం శిక్షణ పూర్తి చేసుకున్న కార్యదర్శులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ట్రైనీ కలెక్టర్ ఆర్. ఎస్ నాయుడు, కమిషనర్ శ్రీరాములునాయుడు మాట్లాడుతూ విస్తృతమవుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో ముందుకు సాగవలసిన అవసరం అందరిపైనా ఉందన్నారు.

ఆటల పోటీలు ప్రారంభం

వేపాడ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఈనెల 15వ తేదీన నిర్వహించనున్న స్వాతంత్ర దినోత్సవం వేడుకలు సందర్భంగా ఆటల పోటీలను ప్రారంభించారు. వివిధ క్రీడల పోటీలకు బుధవారం లాటరీలు తీశామని ప్రిన్సిపల్ ఆర్. అప్పారావు తెలిపారు. ఈ పోటీలకు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనడం ఆనందగా ఉందన్నారు

బూత్ లెవెల్ అధికారులతో సమావేశం

బొబ్బిలి: అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల వెరైఫికేషన్ ప్రక్రియపై కమిషనర్ ఎస్. శ్రీనివాసరావు తన కార్యాలయంలో బుధవారం బూత్ లెవెల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆగస్టు 21 నాటికి పట్టణంలో చేస్తున్న సర్వేను పూర్తి చేయాలన్నారు. ఫారం-6 ద్వారా చేర్పులు, ఫారం-7 ద్వారా తొలగింపులు పూర్తి స్థాయిలో తనిఖీ చేసి సర్వే చేయాలని తెలియజేశారు.

అంగన్వాడీ కేంద్రానికి స్థలం అప్పగింత

రేగిడి: మండలంలోని చాటాయవలసలో అంగన్వాడీ కేంద్రానికి భూ మార్పిడి కింద మూడు సెంట్లు భూమిని వెంక పాపారావు ఇచ్చినందున ఐసిడిఎస్‌కు తహసిల్దార్ టి. కళ్యాణ చక్రవర్తి బుధవారం స్థలాన్ని అప్పగించారు. అంగన్‌వాడీకి స్థల సమస్య ఉన్న నేపథ్యంలో రైతు నుంచి భూ మార్పిడి కింద ఒప్పించి స్థలం కేటయించామని తెలిపారు. 22/4లో మూడు సెంట్లు తీసుకొని అంగన్వాడి కేంద్రానికి నిర్మాణ పనులకు కేటాయించినట్లు తెలిపారు. ఇప్పటికే అంగన్వాడి కేంద్రానికి మార్కింగ్ చేసినట్లు వెల్లడించారు. వీరితోపాటు ఎంపిటిసి అప్పలనాయుడు, ఆర్ఐ రేవతి, సచివాలయ ఉద్యోగుల ఉన్నారు.

ఘనంగా మహేష్ బాబు జన్మదిన వేడుకలు

బొబ్బిలి: సినీ నటుడు ప్రిన్స్ మహేష్ బాబు జన్మదిన వేడుకలు పట్టణంలో బుధవారం అభిమానులు ఘనంగా నిర్వహించారు. టిబిఆర్ థియేటర్లో బిజినెస్ మెన్ చిత్రాన్ని ప్రదర్శించి అభిమానులు కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు నిర్వహించారు. అనంతరం బేబినాయన ఏర్పాటు చేసిన అన్నా క్యాంటీన్ వద్ద అభిమానులు పేదలకు భోజనాలు పెట్టారు.

అవకతవకలపై విచారణ

భోగాపురం : మండలంలోని ముక్కాం జగనన్న కాలనీలో జరిగిన అక్రమాలపై జిల్లా కలెక్టర్ విచారణకు ఆదేశించారు. విచారణ అధికారిగా గజపతినగరం డిఇ సత్యనారాయణను నియమించారు. ఈ కాలనీలో లబ్ధిదారులకు తెలియకుండానే 2021లో ఐరన్, సిమెంట్ విత్ డ్రా జరిగినట్లు కొంతమంది లబ్ధిదారులు స్పందనలో సోమవారం ఫిర్యాదు చేశారు. హౌసింగ్ అధికారులతో పాటు ఇంజనీరింగ్ అసిస్టెంట్, స్థానిక నాయకులు కలిపి అక్రమాలకు పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొనడంతో కలెక్టర్ విచారణకు ఆదేశించారు. ఈ మేరకు విచారణ అధికారి సత్యనారాయణ స్థానిక డిఇ మురళితో కలిసి ముక్కాం సచివాలయానికి వచ్చారు. జగనన్న కాలనీలో లబ్ధిదారుల జాబితాను తీసుకున్నారు. ఈ నెల 16వ తేదీన లబ్ధిదారులందరూ విచారణకు హాజరయ్యేలా చూడాలని ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఈశ్వరమ్మకు సూచించారు. గ్రామంలో టాంటాం వేయించి ప్రతి లబ్ధిదారుడికి సమాచారాన్ని చేరవేయాలని ఆదేశించారు.

నేరాలు ఘోరాలు

గంజాయి కేసులో పదేళ్ల జైలు శిక్ష

విజయనగరం: కొత్తవలస పోలీసు స్టేషన్‌లో 2016లో నమోదైన గంజాయి కేసులో నలుగురు నిందుతులకు పదేళ్ల జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ. లక్ష జరిమానా విధిస్తూ విజయనగరం ఒకటవ ఎడిజె జడ్జి టి. రజని బుధవారం తీర్పు వెల్లడించినట్లు జిల్లా ఎస్‌పి ఎం.దీపిక తెలిపారు. సంతపేట వద్ద హర్యానా రాష్ట్రానికి చెందిన సూరజ్‌మాల్, సూర్యా, సురేష్, కలియా అనే నలుగురు వద్ద పోలీసులు 244 కిలోల గంజాయిని పట్టుకున్నారు. ఆరోపణలు రుజువు కావడంతో శిక్ష విధించినట్లు ఎస్‌పి తెలిపారు.

ఏడు మద్యం సీసాలు పట్టివేత

లక్కవరపుకోట: మండలంలోని గంగుబూడి సమీపంలో ఉన్న ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకు ఎదురుగా అక్రమంగా మద్యం అమ్ముతున్న వారి నుండి ఏడు మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు స్థానిక ఎస్ఐ ఎం ముకుందరావు బుధవారం తెలిపారు. అక్రమ మద్యం అమ్మకాలకు పాల్పడిన కొత్తవలస మండలం ఉత్తరాపల్లి పంచాయితీకి చెందిన సింగంపల్లి కాంతను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు వివరించారు. అజ్ఞాత వ్యక్తి ఇచ్చిన సమాచారం మేరకు నిర్వహించిన తనిఖీలో పట్టుబడినట్లు తెలిపారు.

క్విట్ మోడీ.. క్విట్ బిజెపి

రాజ్యాంగ పరిరక్షణ వేదిక సభలో వక్తలు

సభలో మాట్లాడుతున్న తమ్మినేని సూర్యనారాయణ

ప్రజాశక్తి- బొబ్బిలి

దేశం నుంచి బిజెపిని, మోడీని తరిమికోడితేనే దేశానికి, దేశ ప్రజలకు, దేశ సంపదకు రక్షణ లభిస్తుందని పలువురు వక్తలు అన్నారు. మణిపూర్ అల్లర్లకు వ్యతిరేకంగా రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో పట్టణంలో బుధవారం సాయంత్రం శాంతి ర్యాలీ చేసి తాండ్రపాపరాయ విగ్రహం జంక్షన్‌లో సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ దేశ సంపదను బిజెపి కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తుందన్నారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో బిజెపి, ఆర్ఎస్ఎస్ బ్రిటిష్ వారికి అనుకూలంగా పని చేశారన్నారు. దేశం నుంచి మోడీని, బిజెపిని పంపించాలని పిలుపునిచ్చారు. మణిపూర్‌లో ఖనిజ సంపదను కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు అల్లర్లు, విధ్వంసాలను సృష్టిస్తున్నారని విమర్శించారు. భరతమాతను పూజించే బిజెపి, ఆర్ఎస్ఎస్ భరతమాతలను వివస్త్రలను చేసి అవమానిస్తున్నారని విమర్శించారు. హిందువులకు ప్రధాని కాదని, భారత దేశానికి మోడీ ప్రధాని అని అన్నారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా మోడీ పని చేసిన సమయంలో గోద్రా అల్లర్లు జరిగితే దేశ ప్రధానిగా మోడీ ఉన్న సమయంలో దేశంలో అల్లర్లు, విధ్వంసాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మతోన్మాదాన్ని, ఉన్మాదాన్ని రెచ్చగొడుతున్నారన్నారు. బిజెపిని గెలిపిస్తే దేశానికి మంచి రోజులు వస్తాయని చెప్పి ఆధాని, అంబానీలకు మంచి రోజులు తెచ్చారని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు కారుచౌకగా అమ్మివేయడం దేశభక్తా అని ప్రశ్నించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రైల్వే జోన్, ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజి ఇస్తామని చెప్పిన మోడీ ఎక్కడ ఇచ్చారని ప్రశ్నించారు. మోడీ హయాంలో పారిశ్రామిక రంగం కుంటుపడిందన్నారు. దేశాన్ని వినాశనం చేసిన ఘనత మోడీకే దక్కుతుందన్నారు. మోడీ పాలనలో మతోన్మాద దాడులు, మహిళలపై దాడులు పెరిగిపోయాయని విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని, ఢిల్లీ ప్రభుత్వానికి హక్కులు కల్పించకుండా లెఫ్టినెంట్ గవర్నర్‌కు హక్కులు ఇవ్వడం ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని ఉల్లంఘించడమే అన్నారు. బిజెపి దాడులను, మణిపూర్ అల్లర్లను రాష్ట్రంలో వైసిపి, జనసేన, టిడిపి ఖండించకపోవడం దుర్మార్గమన్నారు. రాష్ట్రానికి, దేశ ప్రజలకు అన్యాయం చేసిన బిజెపిని ఓడించాలని పిలుపునిచ్చారు. యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి మాట్లాడుతూ మోడీ పాలనలో మహిళలు, మైనార్టీలకు రక్షణ లేదన్నారు. విభిన్న జాతులు, భాషలు ఉన్న దేశంలో అరాచకాలు సృష్టించడం దుర్మార్గమన్నారు. మత ప్రచారం కోసం మణిపూర్‌లో అల్లర్లు సృష్టిస్తున్నారని విమర్శించారు. వేల సంఖ్యలో ఇళ్లను తగలబెట్టి గిరిజన తెగకు చెందిన వారిని చిత్రహింసలకు గురి చేసి చంపేశారని చెప్పారు. లౌకిక దేశంలో మత విద్వేషాలను రెచ్చగొట్టడం దుర్మార్గమన్నారు. మణిపూర్‌లో కుకీలను ప్రాణ, మాన, ఆస్తి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. పౌర హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తుందని విమర్శించారు. సభలో పిసిసి సభ్యులు ముప్వల శ్రీనివాసరావు, పట్టణ కళాసీ సంఘం అధ్యక్షులు బి.అప్పలస్వామి, ఇఫ్టూ నాయకులు ఎం.గోపాలం, పి.లక్ష్మణరావు, క్రిస్టియన్ మైనారిటీ నాయకులు అదృష్టకుమార్, జయరాజ్, ప్రవీణ్, కామేశ్వరరావు, ముస్లిం మైనారిటీ సంఘం నాయకులు అబ్దుల్ హమీద్, జాఫర్, జావేద్ భాషా, సిపిఐ నాయకులు ఎం.శ్రీనివాసరావు, వై.ఆనందరావు, ఏఐఎస్ఎఫ్ నాయకులు రవికుమార్, సిఐటియు నాయకులు ఎ. సురేష్ మాట్లాడారు. రాజ్యాంగ పరిరక్షణకు పోరాటం చేసేందుకు బహిరంగ సభలో నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కల్యాణ్ చక్రవర్తి

ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

ప్రజాశక్తి - కొత్తవలస

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందినప్పుడే ఏ వ్యవస్థ అయినా అభివృద్ధి చెందుతుందని జిల్లా గ్రామీణ అభివృద్ధి పథక సంచాలకు ఎ.కళ్యాణ్ చక్రవర్తి అన్నారు. బుధవారం సాయింత్రం స్థానిక స్టేట్ బ్యాంక్ ఆవరణలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు వ్యాపార వ్యవస్థాపకులుగా మారితేనే వారి జీవన విధానంలో మార్పు కనిపిస్తుందన్నారు. ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ పథకం, ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ పథకాన్ని మహిళా సంఘాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ పథకాలు అమలు జరిగే క్రమంలో బ్యాంకర్లు తగిన ప్రోత్సహం అందిస్తే మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందగలరన్నారు. సిబ్బంది పనితీరు భేష్ అని అన్నారు. కొత్తవలస బ్యాంకు మేనేజర్ శ్రీనివాస్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కొత్తవలస, లక్కవరపుకోట, వేపాడ మండలాల బ్రాంచ్ మేనేజర్లు, ఐకేపీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన లేని సచివాలయ సిబ్బంది

- మధ్యాహ్నం 3.30 గంటల వరకూ రాని వైనం
- యూనిఫామ్ వేసుకోకుండానే విధులకు
- కొరవడిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ

సిబ్బంది లేకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు

ప్రజాశక్తి- వేపాడ

మండలంలోని పలు సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు సమయం పాటించడం లేదు. ఇష్టం వచ్చినపుడు వచ్చి వెళ్తున్నారు. వారి కోసం ప్రజలు సచివాలయాల వద్ద నిరీక్షించాల్సి వస్తుంది. మరికొంత మంది సిబ్బంది ఏకంగా మధ్యాహ్నం 3.30గంటల వరకూ రావడం లేదు. పైగా యూనిఫామ్ కూడా వేసుకోకుండా ఇష్టానుసారంగా దుస్తులు ధరించి సచివాలయాలకు వస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

మండలంలోని కొమ్మపల్లి ప్రజలకు సచివాలయం ద్వారా సకాలంలో సేవలు అందడం లేదు. ఇక్కడ సిబ్బంది తీరు విస్మయానికి గురి చేస్తోంది. మధ్యాహ్నం 3.30 గంటల దాటిన కొంతమంది విధులకు హాజరకాకపోవడం, విధులు నుండి బయటకు వెళ్లేటప్పుడు డ్యూటీ మూమెంట్ రిజిస్టర్‌పై సంతకాలు, సమాచారం లేకుండా వెళ్లిపోవడం వంటి పనులు చేస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన యూనిఫామ్ లేకుండా ఉద్యోగులు తమ వెంట తెచ్చిన బ్యాగులో యూనిఫామ్ ఉంచి తమ సొంత అవసరాలు తీర్చుకునేందుకు సాధారణ దుస్తులు ధరించి సచివాలయానికి రాకుండా డుమ్మా కొడుతున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే మీరు ఎవరు ఎందుకు వచ్చారని ఆవేశంతో ఊగిపోతూ సిబ్బంది వ్యవహరిస్తున్న తీరు ఆశ్చర్యానికి గురిచేస్తుంది. దీంతో స్థానికులు అసహనానికి గురవుతున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడటంతో సిబ్బంది ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. సిబ్బంది సమయపాలన పాటించక పోవడంతో వివిధ పనుల నిమిత్తం వచ్చిన ప్రజలు నిరీక్షించి వెనుదిరిగి వెళ్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని సక్రమంగా విధులు నిర్వర్తించేలా చూడాలని కోరు తున్నారు. ఈ విషయంపై ఎంపిపి డి. సత్యవంతుడుని వివరణ కోరగా సచివాలయ సిబ్బంది తనకు కూడా సరైన సమాధానం చెప్పకుండా తప్పుడు సమాచారం చెబుతున్నారని, ఎంపిపిగా ఉన్న తన గ్రామంలోనే సిబ్బంది తీరు ఇలా ఉంటే ఎలా అని ఆయన అసహనం వ్యక్తం చేశారు

మేజర్ పంచాయతీలో 'ఆజాదికా అమృత్'

ప్రజాశక్తి కొత్తవలస

కొత్తవలస మేజర్ పంచాయతీ కార్యాలయంలో కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆజాదీకా అమృత్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఇందులో భాగంగా నా భూమి- నా దేశం నేల తల్లికి నమస్కారం - వీరులకు వందనం అనే ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు పాల్గొని సచివాలయం -4 ఆవరణలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ, పిఎసిఎస్ అధ్యక్షులు గొరపల్లి శివ, వేపాడ ఎంపిపి దొగ్గ సత్యవంతుడు, ఎల్ కోట జెడ్‌పిటిసి తూర్పాటి వరలక్ష్మి, కొత్తవలస మండల జెసిఎస్ ఇంచార్జ్ బొంతుల వెంకటరావు, స్టేట్ డైరెక్టర్ వాకాడ రాంబాబు, వైస్ ఎంపిపి కర్రి శ్రీనివాస రావు, పినిశెట్టి వెంకటరమణ, మేలాస్త్రి అప్పా రావు, మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

వేపాడ: మండలంలోని జాకేరు గ్రామంలో బుధవారం ఆజాదికా అమృత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి దొగ్గ సత్యవంతుడు గ్రామంలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సేనాపతి అప్పారావు, వైస్ ఎంపిపి అడపా ఈశ్వరరావు, స్థానిక సర్పంచ్ బుద్ధ చిన్నమ్మలు, అప్పల నాయుడు, స్థానిక ఎంపిటిసి రమణ, సోంపురం ఎంపిటిసి ఆకుల సత్తిబాబు, పాల్గొన్నారు.

విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

నెల్లిమర్ల: విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని వైస్ ఛాన్సెలర్ ప్రొఫెసర్ పి.కె.మహంతి పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం ఆయన క్యాంపస్‌లోని 'సెంచూరియన్ కాఫీ కనెక్ట్' షాపును ప్రారంభించారు. బిబిఎ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఈ షాపును నిర్వహించనున్నారని తెలిపారు. విద్యార్థులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడానికి ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. విద్యార్థులకు స్టడీలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇ- పంట నమోదు వచ్చే నెలలో పూర్తి

నెల్లిమర్ల: ఈ పంట నమోదు సెప్టెంబర్ 15నాటికి పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయాధికారి వి.టి.రామారావు సూచించారు. గురువారం ఆయన రామతీర్థం గ్రామంలో ఇ -పంట నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వేసిన ప్రతీ పంట ఇ -పంటలో నమోదు చేసుకోవాలని కోరారు. గ్రామ వ్యవసాయ సహాయకులు త్వరితగతిన ఇ-పంట నమోదు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి ఎం.పూర్ణిమ, మాజీ సర్పంచ్ కంచరాపు రాము, విఎఎ చంద్ర, రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక ఆదాయం

నెల్లిమర్ల : ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం, అధిక ఆదాయం లభిస్తుందని అనంతపూర్ ప్రకృతి వ్యవసాయ మెంటర్ బొజ్జప్ప తెలిపారు. మండలంలోని వల్లూరు యూనిట్ పరిధిలోని ఒమ్మిలో అంబళ్ల విజయలక్ష్మి పొలంలో బుధవారం అనంతపూర్ మోడల్లో విత్తనాలు వేయించారు. ఆయన మాట్లాడుతూ తక్కువ విస్తీర్ణంలో బహుళ పంటలు వెయ్యడం వల్ల నేలలో సేంద్రియ కర్బణం పెరిగి రైతుకు అదనపు ఆదాయం వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో చీపురుపల్లి డివిజన్ ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ బి.సత్యనారయణ, మండల యాంకర్ వర్రి గాయత్రి, మోడల్ మేకర్ కె.లక్ష్మి, వల్లూరు యూనిట్ ఐసిఆర్‌పిలు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట

బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

వైసిపి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి పెద్ద పీట వేస్తుందని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. బుధవారం తంగుడుబిల్లి బిసి కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ డాక్టర్ పి.సురేష్ బాబుతో కలిసి ఇంటింటికి వెళ్లి అభివృద్ధి, సంక్షేమ పథకాలు పై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో సచివాలయం, ఆర్బికే, వెల్‌నెస్ సెంటర్లకు నూతన భవనాలు నిర్మించామన్నారు. ఈ ప్రభుత్వానికి మద్దతిచ్చి మరోసారి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి వైస్ ఛైర్మన్ చనమల్ల వెంకటరమణ, జెడ్‌పిటిసి గదల సన్యాసి నాయుడు, టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రేగాన శ్రీని వాసరావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ఎరువుల నిల్వ

ప్రజాశక్తి - జామి

మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో అక్రమ ఎరువులు నిల్వలను బుధవారం అధికారులు పట్టుకున్నారు. విజిలెన్స్ అధికారులు స్థానిక వ్యవసాయ అధికారులతో కలిసి దాడులు నిర్వహించగా అనధికారికంగా ఎరువులు విక్రయిస్తున్నట్లు గుర్తించి, నిల్వలను సీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ అధికారి బి.సింహాచలం, ఎఒ కిరణ్ కుమార్ వారి బృందాలతో కలిసి దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ అనుమతులు, లైసెన్సు ఉన్న దుకాణాల్లో ఎరువులు విక్రయించాలని లేని యెడల చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కంటి శస్త్రచికిత్సలకు 52 మంది ఎంపిక

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండల కేంద్రలోని పిహెచ్‌సిలో బుధవారం ఏర్పాటు చేసిన వైఎస్ఆర్ కంటి వెలుగు కార్యక్రమంలో 154 మంది తనికీలు చేయించుకున్నారు. వారిలో 52 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేసినట్లు వైద్యులు రాజేష్‌వర్మ తెలిపారు. శంకర్ పౌండేషన్ సహకారంతో సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని సర్పంచ్ టొంపల సీతారాం ప్రారంబించారు. శస్త్రచికిత్సలకు శంకర్‌పౌండేషన్ ఆధ్వర్యంలో విశాఖపట్నం తీసుకువెల్లారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది సిహెచ్ఒ వేదమని, ఆర్‌వి రమణ, శంకర్ పౌండేషన్ కోఆర్డినేటర్ జోగారావు, సత్యసాయి భజన మండలి కన్వినర్ బలభద్రుని రామారావు పాల్గొన్నారు.

పూసపాటిరేగ: శిబిరంలో పాల్గొన్న వృద్ధులు

స్వామికంటి ఆస్పత్రి ఆధ్వర్యాన వైద్య శిబిరం

విజయనగరం : సూపర్ స్టార్ మహేష్ బాబు పుట్టినరోజు వేడుకలు అభిమానుల సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌విసి రంజని- శివరంజని థియేటర్లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మహేష్‌బాబు అభిమానుల సంఘం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించింది. జిల్లా కృష్ణ, మహేష్ బాబు, సుధీర్ బాబు కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ మంచు కుమారస్వామి కంటి ఆసుపత్రి సహకారంతో ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 148 మంది రోగులకు కంటి పరీక్షలు నిర్వహించారు. 36 మందిని కంటి ఆపరేషన్ల కు ఎంపిక చేశారు. సూపర్ స్టార్ మహేష్ బాబు ఫ్యాన్స్ సీనియర్ అభిమాని హుస్సేన్, జిల్లా అధ్యక్షుడు ఆర్.వి.రమణ రాజు, కార్యదర్శి అఖిల ప్రింటర్స్ రాంబాబు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

విజయనగరం: తనిఖీ చేస్తున్న వైద్యుడు

ఉత్తమ సేవలకు సత్కారాలు

సత్కరిస్తున్న తోటి ఉద్యోగులు

ప్రజాశక్తి - రామభద్రపురం

మండల భవిత కేంద్రంలో ఉత్తమ సేవలందించి ప్రమోషన్‌తో బదిలీపై వెళుతున్న విద్యాశాఖ సిబ్బందికి, నూతనంగా ఎంఇఒ-2గా వచ్చిన వారికి బుధవారం స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో వీడ్కోలు, స్వాగత సత్కారాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఇఒ తిరుమల ప్రసాద్ మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా భవిత కేంద్రంలో ఐఇఆర్‌టిగా పనిచేసి స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయునిగా బాడంగి పాఠశాలలో చేరిన కొల్లి ఈశ్వరరావు సేవలు నిరుపమానవైనవని, ఎందరో వికలాంగ విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చి దిద్దిన ఘనత ఆయనదేనని వారి ఉన్నతికి ఎందరో దాతలు సహాయ పడేలా సహకరించారని కొనియాడారు. రొంపల్లి క్లస్టర్ సిఆర్పీగా పనిచేసి మలిచర్ల క్లస్టర్‌కు బదిలీపై వెళ్లినా కొన్న చిన్నమ్మడు కూడా తనదైన శైలిలో విద్యార్థులకు ఉత్తమ సేవలు అందజేశారన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎంఇఒ2గా చేరిన రేగాన పెంటయ్యకు స్వాగతం చెపుతూ విద్యారంగ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. అనంతరం వీరిని సత్కరించి చిరు కానుకలు బహూకరించారు. ఈ కార్యక్రమంలో కొట్టక్కి, రామభద్రపురం హెచ్‌ఎంలు రావాడ భాస్కరరావు, కె.కామేశ్వరరావు, మండల విద్యాశాఖ సిబ్బంది సురేష్, వెంకటేష్, రామారావు, నిర్మల, రవి, శ్రీను, ప్రసాద్, అచ్చుతరావు, తులసి, సుధారాణి పాల్గొన్నారు.

ఐదు నామినేషన్ల స్వీకరణ

ప్రజాశక్తి - వంగర

మండలంలో ఓని అగ్రహారం, లక్ష్మింపేట, గ్రామాల్లో సర్పంచులు, కొట్టిస, ఇరువాడ, కొప్పరవలస, రుసింగి గ్రామాలలో వార్డు మెంబర్లకు సంబంధించి ఖాళీలు ఏర్పడడంతో, వాటికి సంబంధించి ఎన్నికలు జరిపించేందుకు ప్రభుత్వ ఆదేశాలు జారీ చేయడంతో, ఇరువాడలో వార్డు మెంబర్‌కు సంబంధించి మంగళవారం ఒక నామినేషన్ దాఖలు కాగా, బుధవారం ఓని అగ్రహారం, లక్ష్మిం పేట సర్పంచులకు ఆ రెండు గ్రామాల నుంచి రెండు నామినేషన్లు, కొట్టిస రుషింగి గ్రామాలకు సంబంధించి రెండు వార్డు మెంబర్లకు, మొత్తం కలిపి ఇప్పటివరకు ఐదు నామినేషన్లు దాఖలు అయినట్లు ఎంపిడిఒ వావిలిపల్లి శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. నామినేషన్లను అభ్యర్థులు రిటర్నింగ్ అధికారుల జయప్రకాష్, కన్నబాబులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.


నామినేషన్ స్వీకరిస్తున్న అధికారులు

విద్యార్థులు ఎలా చదవాలి?

- కెజిబివి ఎస్ఒను ప్రశ్నించిన డిఇఒ
- మరుగుదొడ్ల నిర్వహణపై అసంతృప్తి

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని దేవుదళ కస్తూరిభా గాంధీ విద్యాలయంలో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులకు హిందీ పాఠ్యపుస్తకాలు అందకపోవటంతో విద్యార్థులు ఎలా చదివేదని కస్తూరిబా గాంధీ ప్రత్యేక అధికారిని ఎం. లక్ష్మీని జిల్లా విద్యాశాఖ అధికారి లింగేశ్వర్ రెడ్డి ప్రశ్నించారు. ఈ మేరకు బుధవారం లింగాలవలస, దేవుదల, లక్ష్మంపురం తదితర పాఠశాలను ఆకస్మకంగా తనిఖీ చేశారు. దేవుదళ కస్తూరిభా గాంధీ విద్యాలయంలో భోజన పథకం పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలల్లో నాడు- నేడు పనులను వేగవంతం చేసి అందుబాటులోకి తేవాలన్నారు. మండల కేంద్రం నుంచి హిందీ పాఠ్య పుస్తకాలు రానందున ఇవ్వలేకపోయామని ఎస్ఒ లక్ష్మి డిఇఒకు తెలిపారు. రాజాం నుంచి పాఠ్యపుస్తకాలు తెప్పించి విద్యార్థులకు అందజేయాలని ఆదేశించారు. లింగాలవలస ఉన్నత పాఠశాలలో నాడు నేడు పనులు వేగవంతం చేయాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి. కృష్ణారావుకు సూచించారు. అనంతరం ఎంపిఎస్ పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాల మరుగుదొడ్లు పరిశుభ్రంగా లేని కారణంగా అసంతృప్తి వ్యక్తం చేశారు. పరిశుభ్రంగా ఉంచేలా కృషి చేయాలన్నారు. ఈయనతోపాటు ఎంఇఒ-2 ఎరకయ్య, ఏసి సూర్యారావు ఉన్నారు.

వంగ సామగ్రిని పరిశీలిస్తున్న డిఇఒ

ప్రజా వేదికలో రూ.68 వేలు రికవరీ

నెల్లిమర్ల: గ్రామీణ ఉపాధహామీ పథకం సామజిక తనిఖీ ప్రజా వేదికలో అధికార్ల రూ.68వేలు రికవరీ తేల్చారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో గ్రామాల్లో జరిగిన సామజిక తనిఖీ పై ప్రజా వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా 28 గ్రామాల్లో గ్రామీణ ఉపాధహామీ పథకం పనులకు రూ.17కోట్లు ఖర్చు చేసినట్లు అధికార్లు చెప్పారు. సామాజిక తనిఖీలో వచ్చిన అభ్యంతరాలను ప్రజా వేదికలో క్షేత్ర సహాయకులు నుంచి రూ.55వేలు, సాంకేతిక సహాయకులు నుంచి రూ.8వేలు, కంప్యూటర్ ఆపరేటర్ల నుంచి రూ.5వేలు మొత్తం రూ. 68వేలు రికవరీ తేల్చారు. ఈ కార్యక్రమంలో అబుడ్స్ మెంట్ అన్నపూర్ణ, పిఒ శారదా దేవి, జిల్లా విజిలెన్స్ అధికారి ఎస్. రవీంద్ర, క్లస్టర్ ఎపిడి వి.వి.ఎస్. లక్ష్మణ్, ఎంపిడిఒ జి. గిరిబాల, ఎపిఒ జి. అరుణ కుమారి, ఆర్పీ, డిఆర్పీలు, ఎఫ్.ఎలు తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్ కమిషన్ సభ్యుల పర్యటన

ప్రజాశక్తి-బొబ్బిలి రూరల్

మండలంలో ఫుడ్ కమిషన్ సభ్యులు దేవి, లక్ష్మి రెడ్డి బుధవారం విస్తృతంగా పర్యటించారు. మండలంలోని పారాది జిల్లా పరిషత్ పాఠశాలలో మధ్యాహ్న భోజనం పథకం అమలు తీరును పరిశీలించారు. గుడ్లు లెక్కకు మించి నిల్వ ఉండడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. పిల్లలకు గుడ్లు పెట్టకుండా మిగుల్చుతున్నారా అని ప్రశ్నించారు. అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. బొబ్బిలి కెజిబివి పాఠశాలను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాలు పెట్టాలని సూచించారు. భోజనాల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కమిషన్ సభ్యులతో రెవెన్యూ అధికారులు ఉన్నారు.